02.09.2026
బుధవారం
www.bestvoicenews.com
bestvoice

# బెస్ట్ వాయిస్

తెలుగు దినపత్రిక

సంపుటి:11 | సంచిక : 59 | వెల:రూ 1/- వరంగల్ ఎడిటర్: కె.మోహన్‌రావు పేజీలు 07

# మంత్రివర్గంలో మార్పులా?, సమూల ప్రక్షాళనా!

## ఉత్కంఠగా కాంగ్రెస్ రాజకీయం



- తెలంగాణ మంత్రివర్గ కూర్పుపై ఉత్కంఠ
- ఢిల్లీకి చేరుకుంటున్న సీనియర్ కాంగ్రెస్ ముఖ్య నేతలు
- మంత్రివర్గంలో మార్పులు చేస్తారా, సమూల ప్రక్షాళన ఉంటుందా అనే దానిపై ఆసక్తి

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ మంత్రివర్గంలో జరగనున్న మార్పులపై కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ నాయకులంతా ఢిల్లీకి వెళుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు నేడు ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర మంత్రులను కలవడానికని, జలశక్తి మంత్రిత్వశాఖ నిర్వహించే సమావేశానికని, వై.ఎస్.రాజశేఖరరెడ్డి అవార్డు ప్రదానోత్సవానికని ఇలా ఒక్కొక్కరు ఒక్కో కారణం చెబుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా వారందరి ఢిల్లీ పర్యటన తీవ్ర ఆసక్తికరంగా మారింది. విదేశీ పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీ చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిన్న సాయంత్రమే కేసీతో సమావేశమై ఇటీవల పరిణామాల గురించి సుదీర్ఘంగా చర్చలు చేశారు. సురేఖ వ్యవహారంతోపాటు ఒకరిద్దరు మంత్రుల వ్యవహారశైలి గురించి, మంత్రివర్గంలోకి తీసుకోవాల్సిన వారి గురించి మాట్లాడినట్లు సమాచారం. భట్టి, మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కూడా కేసీ చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం నేడు జరగవచ్చని తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనల వంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు లైన్ దాటిన వారిపై చర్యలు అవసరమనే అభిప్రాయంతో మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై చర్య అనివార్యమనే అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది.

**వారిద్దరిపైన చర్యలేనా! :**

పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు వారిద్దరిపైన చర్యలకు మాత్రమే పరిమితమవుతారా? మంత్రివర్గంలో పూర్తిస్థాయిలో మార్పులు చేర్పులు ఉంటాయా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా

మిగతా 2లో..



## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ అక్రమం

రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు.

2



## హామీలపై నిలదీత.. క్షేత్రస్థాయిలో సమరానికి బీఆర్ఎస్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ మరోసారి క్షేత్రస్థాయిలో ఉద్యమానికి సిద్ధమైంది.

5

# బాధ్యతాయుతమైన జర్నలిజంతోనే సమాజానికి మేలు

- వార్త ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలి
- ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా పనిచేయాలి
- సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మొద్దు
- టీడీఎంయూ లోగో ఆవిష్కరణలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత




బెస్ట్ వాయిస్,వరంగల్:

బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వాస్తవాలను పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రజల ముందుకు తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత జర్నలిస్టులకు సూచించారు. వార్త కంటే వాస్తవం ముఖ్యమని, సంచలనం కంటే ప్రజా ప్రయోజనానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. మంగళవారం తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ (టీడీఎంయూ) అధికారిక లోగోను పోలీస్ కమిషనర్ శ్వేత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు చేతిలోని కలం సమాజంపై ఎంతో ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.నిర్ధారణలేని సమాచారాన్నివార్తగా ప్రచురించడంవల్ల వ్యక్తులగౌరవం, ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఏదైనా వార్తను ప్రచురించే ముందు సంబంధిత అంశంపై వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సమాచారం సంచలనాత్మకంగా ఉందనే కారణంతో వెంటనే వార్తగా ప్రచురించకూడదని అన్నారు.

**ప్రజా ప్రయోజనమే ప్రాధాన్యత**

సోషల్ మీడియా విస్తృతమైన నేపథ్యంలో ఏ సమాచారం అయినా క్షణాల్లో వైరల్ అవుతోందని శ్వేత అన్నారు. అయితే వైరల్ అవుతున్న ప్రతి సమాచారం వాస్తవం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోకుండా వార్తలుగా ప్రచురించవద్దని స్పష్టం చేశారు. వైరల్ కావడం వేరు.. వాస్తవం కావడం వేరు అని అన్నారు. ఎక్కువ వ్యూస్, క్లిక్స్ కోసం సంచలనాత్మక వార్తలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడమే జర్నలిజం లక్ష్యంగా ఉండాలని సూచించారు.ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, బాధితుల గళాన్ని వినిపించడం, అవినీతి, అక్రమాలను ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడం జర్నలిజంలో కీలకమని పేర్కొన్నారు. పోలీసులు, ప్రభుత్వ శాఖలు, సంబంధిత అధికారుల నుంచి అధికారిక సమాచారాన్ని తీసుకున్న తర్వాతే వార్తలను నిర్ధారించుకోవాలని సూచించారు.అదేవిధంగా వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన అంశాలు, బాధితులు, మహిళలు, చిన్నారుల విషయంలో వార్తలు రాసేటప్పుడు మరింత సంయమనం పాటించాలని కమిషనర్ శ్వేత సూచించారు. బాధితుల కష్టాలను సంచలనంగా మార్చకుండా వారి సమస్యలను సమాజం, అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా జర్నలిజం ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, కోశాధికారి పల్లె వంశీ, ఉపాధ్యక్షుడు కౌడగని మోహన్ రావు, జాయింట్ సెక్రటరీ బూర నగేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ఈసీ మెంబర్ రవీందర్ పాల్గొన్నారు.



కొడగాని మోహన్‌రావు
-ఎడిటర్
99633 34550

# దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు

- పాల కుమారస్వామి

బెస్ట్ వాయిస్,వరంగల్:



దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ 40వ డివిజన్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, 5వ బ్లాక్ ఇన్‌చార్జ్ పాల కుమారస్వామి అన్నారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా వేదికను 'శుద్ధీకరణ' పేరుతో శుద్ధి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దళిత నాయకుడిని అవమానించేలా జరిగిన ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని పాల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ సమర్థించినట్లు వచ్చిన వ్యాఖ్యలపైనా చట్టపరంగా విచారణ జరిపించాలని కోరారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే ఈ ఘటనకు కులపరమైన ఉద్దేశం లేదని, ఇతర కారణాలతోనే కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు చెబుతున్న అంశాన్ని కూడా దర్యాప్తులో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. నిజానిజాలను నిష్పక్షపాతంగా విచారించి, తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడమే ప్రజాస్వామ్యానికి న్యాయమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులపై అవమానాలు, వివక్షకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో దేశంలో ఏ దళితుడూ కులం కారణంగా అవమానానికి గురికాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని పాల కుమారస్వామి కోరారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం ప్రతి పౌరుడికి అందేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఓటరు జాబితాలో వివరాలను పరిశీలించుకోవాలి

- 25వ డివిజన్‌లో 72వ బూత్ వార్డు సభ

బెస్ట్ వాయిస్,వరంగల్:



ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ప్రతి ఓటరు పరిశీలించుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. వరంగల్ నగరంలోని 25వ డివిజన్ పరిధిలో వాటర్ ట్యాంక్ చార్బోలి సమీపంలో 72వ బూత్ వార్డు సభను మంగళవారం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ మురళీధర్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల్ నవీన్ రాజ్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా SIR ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలించి, ఓటరు జాబితాలోని వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు, అభ్యంతరాలు లేదా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిర్ణీత విధానంలో సరిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో BLO సీహెచ్ రజిత, 25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్ను శ్యామ్, జన్ను కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. ఓటు మన హక్కు మాత్రమే కాదు ప్రజాస్వామ్యానికి మన బాధ్యత కూడా అని నాయకులు పేర్కొన్నారు.

# మంత్రివర్గంలో మార్పులా?, సమూల ప్రక్షాళనా!

తరువాయి భాగం

మారింది. మరోవైపు సురేఖ దిల్లీ వెళ్లడంతో చర్యకు ముందు ఆమె వాదన కూడా అధిష్ఠానం వినే అవకాశం ఉందని పార్టీలో కొందరు చెప్తున్నారు. సురేఖను మంత్రివర్గం నుంచి తప్పిస్తే ఆమె స్థానాన్ని భర్తీ చేసి ఊరుకుంటారా? లేక ఖాళీగా ఉన్న మరో రెండు స్థానాలను కూడా భర్తీ చేయడం, శాఖల్లో మార్పు వంటి పూర్తిస్థాయి ప్రక్షాళన ఉంటుందా అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఆ తర్వాతనే కేబినెట్ విస్తరణపై దృష్టి పెట్టొచ్చని విశ్వసనీయంగా తెలుస్తోంది. కొండా సురేఖ స్థానాన్ని భర్తీ చేయాల్సి వస్తే దీంతోపాటు ఖాళీ ఉన్న రెండు స్థానాలవరకే పరిమితమై ప్రస్తుత మంత్రుల శాఖల జోలికి వెళ్లకపోవచ్చనే విషయం కూడా స్పష్టం అవుతోంది. సురేఖ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందినవారికి ఇవ్వాల్సి వస్తే అందులో మొదటగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరును పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉంది. చిన్నారెడ్డిని తొలగిస్తే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిని బీసీ నాయకులకు కేటాయించవచ్చు. పీసీసీ మహేశ్‌కుమార్ కూడా మంత్రివర్గంలో చోటుకు ఆసక్తిగా ఉన్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది.





# హిందూ స్మశానవాటికలో మొక్కలు నాటిన చేయూత స్వచ్ఛంద సంస్థ

- రూ.3 లక్షలకు పైగా విలువైన స్వర్గరథం విరాళం

బెస్ట్ వాయిస్,వరంగల్:

లేబర్ కాలనీలోని హిందూ స్మశానవాటికలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ హార్టికల్చర్ విభాగం సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో 18, 19, 27, 16వ డివిజన్లకు చెందిన కాలనీ పెద్దలు, నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జీడబ్ల్యూఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారి ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మామిడాల రమేష్‌బాబు కోరారు.

**రూ.3 లక్షలకు పైగా విలువైన స్వర్గరథం విరాళం**

కార్యక్రమం అనంతరం హిందూ స్మశానవాటిక వినియోగం కోసం లాకుం రవి రూ.3 లక్షలకు పైగా విలువైన స్వర్గరథాన్ని విరాళంగా అందించారు. స్మశానవాటిక అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో చేయూత సంస్థ ప్రధాన కార్యదర్శి మూడేడ్ల సతీష్, ఉపాధ్యక్షులు కుందారపు రాజేందర్, బేతి అశోక్ బాబు, ముఖ్య సలహాదారు కుసుమ సత్యనారాయణ, కోశాధికారి అనుముల జనార్ధన్, సలహాదారు గంట రమేష్, సభ్యులు గద్దమీది రాజేష్, బేతి మదన్ మోహన్, బేతి రాజు, కుడికాల శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాలనీ పెద్దలు బండి సత్యం, జోగు చంద్రశేఖర్, బంక కుమారస్వామి, పోలు బిక్షపతి, కనుకుంట్ల రంజిత్, ఆవుల రమేష్, గుండా స్వామి, కుడికాల కుమారస్వామి, మామిడాల రాజారాం, యూత్ సభ్యులు దేవునూరి రాజు, బొడ్డు రాకేశ్ తదితరులు హాజరయ్యారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ అక్రమం

- ఎర్రబెల్లి స్వర్ణ
- బీజేపీ కక్షపూరిత రాజకీయాలను ఖండిస్తూ మహిళా కాంగ్రెస్ నిరసన

బెస్ట్ వాయిస్,హైదరాబాద్:



రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూర్చున్న ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన ఘటనను ఖండిస్తూ, బాధ్యులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం గాంధీభవన్ నుంచి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో గాంధీభవన్ ఎదుట మహిళా కాంగ్రెస్ నాయకులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. ఒక దళితుడు కూర్చున్న ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇది మల్లికార్జున్ ఖర్గేను అవమానించడమే కాకుండా భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడమేనని విమర్శించారు. ఈ ఘటనను ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. న్యాయం కోసం ప్రశ్నించే గొంతులను అణచివేయాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈరోజు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ అంటే.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై ఎఫ్ఐఆర్ అని స్వర్ణ అన్నారు. రాహుల్ గాంధీ చెప్పిన దరో మత్-భయపడకు నినాదంతో మహిళా కాంగ్రెస్ భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాడుతుందని స్పష్టం చేశారు. కులగణన, మహిళలకు రిజర్వేషన్లు, అదానీ వ్యవహారంపై రాహుల్ గాంధీ ప్రశ్నించిన ప్రతిసారీ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆమె అన్నారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు, హల్ద్వానీ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాస్ సమ్మక్క మృతి ఉద్యమాలకు తీరని లోటు

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

బెస్ట్ వాయిస్,హనుమకొండ:



మాస్ సమ్మక్క మృతి ప్రజా, ఉద్యమాలకు తీరని లోటని ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన మాస్ సమ్మక్క కుటుంబ సభ్యులను మంగళవారం ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్రతినిధి బృందం పరామర్శించింది. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం మర్రిపల్లి గూడెం గ్రామంలో మాస్ సమ్మక్క చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాదగోని రవి మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన సమ్మక్క తన కుమారుడు, నలుగురు కుమార్తెలను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేశారని అన్నారు. కేవలం 60 ఏళ్ల వయసులో ఆమె మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. సమ్మక్క రెండో కుమార్తె మాస్ సావిత్రి విద్యార్థి ఉద్యమాలు, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు ప్రస్తుతం ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్నారని రవి పేర్కొన్నారు. సావిత్రి ప్రజా ఉద్యమాల్లో ముందువరుసలో నిలిచి పనిచేయడం వెనుక ఆమె తల్లి సమ్మక్క ప్రోత్సాహం, కృషి ఎంతో ఉందన్నారు. ప్రజా ఉద్యమాలకు అంకితమైన బిడ్డకు జన్మనిచ్చి, ఆమెకు అండగా నిలిచిన సమ్మక్క మృతి ఎంతో విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. రెడ్డి హంసారెడ్డి, కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కర్ర రాజిరెడ్డి, గుండెబోయిన చంద్రయ్య, నీల రవీందర్, కుసుంబ బాపురావు, సింగతి మల్లికార్జున్, మాలోతు రాజేష్ నాయక్, వంగాల రాగసుధ, కనకం సంధ్య, తాండ్ర కళావతి, హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు చీపురు ఓదయ్య, మొగిలి శ్రీనివాస్‌రావు, మంద భద్రయ్య, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, బాబురావు తదితర పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# జీఓ 97 రద్దు చేయాలని వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా




బెస్ట్ వాయిస్,వరంగల్:

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రస్తుతం డిప్లొమా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థులు మంగళవారం ఎంజీఎం సర్కిల్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. జీఓ 97 కారణంగా డిప్లొమా విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే ముందు వారి అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం డిప్లొమా చదువుతున్న విద్యార్థులు కోర్సు పూర్తిచేసే నాటికి ఉన్నత విద్యలోనూ, ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా శక్తి స్కీంను తమపై అమలు చేయకూడదని విద్యార్థులు డిమాండ్ చేశారు. డిప్లొమా విద్యార్థుల విద్యార్హతలకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**విద్యార్థుల ప్రధాన డిమాండ్లు**

1. జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి.
2. శక్తి స్కీంను డిప్లొమా విద్యార్థులపై అమలు చేయకూడదు.
3. ప్రస్తుతం డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో తగిన అవకాశాలు కల్పించాలి.
4. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాల్లో వారి భాగస్వామ్యం ఉండాలి.
5. డిప్లొమా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

విద్యార్థులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేపట్టి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జీఓ 97పై ప్రభుత్వం పునరాలోచన చేసి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

# పెండింగ్ దరఖాస్తులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

- **ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ, హౌసింగ్‌పై సుదీర్ఘ సమీక్ష**
- **మొగుళ్లపల్లి తహసీల్దార్ బదిలీకి ఆదేశం.. భూపాలపల్లి అదనపు కలెక్టర్‌కు హెచ్చరిక**




బెస్ట్ వాయిస్,మహబూబాబాద్:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెవెన్యూ, హౌసింగ్ శాఖల పనితీరుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు, భూ రీసర్వే, భూభారతి, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లాల వారీగా అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. సమర్థవంతంగా పనిచేస్తున్న అధికారులను అభినందించారు.

**పెండింగ్ దరఖాస్తులపై సీరియస్**

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ల నుంచి కలెక్టర్ల వరకు ప్రతి స్థాయి అధికారి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని హెచ్చరించారు.

**మొగుళ్లపల్లి తహసీల్దార్ బదిలీకి ఆదేశం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో భూ రీసర్వే పురోగతిపై మంత్రి ఆరా తీశారు. తహసీల్దార్ సునీత ఇచ్చిన వివరాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. ఆమెను వెంటనే మొగుళ్లపల్లి నుంచి బదిలీ చేయాలని ఆదేశించారు. భూపాలపల్లి అదనపు కలెక్టర్ పనితీరుపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, పనితీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు.

**ములుగు తహసీల్దార్‌పై ఆగ్రహం**

ములుగు తహసీల్దార్‌పై ప్రజల నుంచి ఇప్పటికే 20 ఫిర్యాదులు వచ్చినప్పటికీ పనితీరులో మార్పు ఎందుకు కనిపించడం లేదని మంత్రి ప్రశ్నించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

**ఐనవోలు తహసీల్దార్‌కు ప్రశంస**

హనుమకొండ జిల్లా ఐనవోలు తహసీల్దార్ విక్రమ్‌ను రీసర్వే, భూభారతి అమలు తదితర అంశాలపై మంత్రి ప్రశ్నించారు. ఆయన స్పష్టంగా, సమగ్రంగా వివరాలు వెల్లడించడంతో మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల పనితీరు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.

**గీసుకొండ తహసీల్దార్ పనితీరుపై సంతృప్తి**

గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్‌ను కూడా మంత్రి వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన పనితీరుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే తరహాలో మిగతా అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న ఇబ్బందులు, భూభారతి అమలు తీరు, తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం ఉండాలని ఆదేశించారు.

# గ్రామ ప్రజల ఆరోగ్యమే మా ధ్యేయం

- **గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్**
- **పాలకుర్తిలో కిడ్నీ వ్యాధులపై ఉచిత వైద్య పరీక్షలు**



బెస్ట్ వాయిస్,పాలకుర్తి:

పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ మరో ప్రజాహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంజలి కిడ్నీ కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ఆ ధ్వర్యంలో కిడ్నీ సంబంధిత వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కిడ్నీ వ్యాధులు ప్రారంభ దశలో గుర్తించకపోతే తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో పరీక్షలు నిర్వహించడం ఎంతో కీలకమని ఈ సందర్భంగా తెలిపారు. ఖరీదైన వైద్య పరీక్షలు చేయించుకోలేని పేద సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు అందించడం ద్వారా వారికి ఆరోగ్య భరోసా కల్పించారు. ప్రజలకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందించడమే నిజమైన ప్రజాసేవా పేద కుటుంబాలు ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్నదే మా లక్ష్యం అని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచ్ అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిండ్ల కవితా శోభన్ బాబు కమ్మగాని సుధాకర్ గౌడ్ కమ్మగాని శ్రీకాంత్ గౌడ్ గ్రామ కార్యదర్శి ఆర్ శ్రీనివాసరెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హంటర్ రోడ్డులో మీడియన్ కటింగ్ మూసివేత

- **ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల నివారణకు ప్రయోగాత్మక చర్యలు**



బెస్ట్ వాయిస్,హనుమకొండ:

హనుమకొండ పట్టణంలోని హంటర్ రోడ్డులో అదాలత్ జంక్షన్ నుంచి నీలిమ జంక్షన్ వరకు ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడంతో పాటు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మార్గంలో పలు పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టారు.ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం న్యూ సైన్స్ కాలేజీకి కొంత దూరంలో ఉన్న మీడియన్ కటింగ్‌ను ఈ నెల 4వ తేదీ నుంచి తాత్కాలికంగా, ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయాలని నిర్ణయించారు.ఈ మార్పును వాహనదారులు, ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.



# కేసీ గుప్త సేవా స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- **కొండ్లె మల్లికార్జున్**

బెస్ట్ వాయిస్,కాచిగూడ:

సమాజ శ్రేయస్సుకు ఆర్యవైశ్య సంఘం విశేష సేవలందిస్తోందని, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ కేసీ గుప్త చూపిన సేవా మార్గంలో పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని కాచిగూడ వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్ పిలుపునిచ్చారు.

కేసీ గుప్త 107వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక జైన్ భవన్‌లో ఇసామియాబజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున్.. కేసీ గుప్త చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేయడంతో పాటు నిరుపేదలకు నిత్యావసర సరుకులు, అవసరమైన పరికరాలు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొమిరిశెట్టి అనిల్ కుమార్, లక్ష్మణ్, వెంకట గోపాల కృష్ణ, వెంకటేష్, రామకృష్ణ, రఘువీర్, మహేష్, నిఖిలేశ్వర్, శ్రీధర్, రవికుమార్, గుండా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బొట్ల కుమార్



బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పర్వతగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సమావేశంలో నూతన మండల కమిటీలను ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బొట్ల కుమార్ మాదిగ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా గద్దల సంపత్ మాదిగ ఎంపికయ్యారు. ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా చిన్నపాక శ్రీకాంత్ మాదిగ, అధికార ప్రతినిధిగా మాసాని రమేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా మంకాల రవి మాదిగను నియమించారు. ఎమ్మెస్పీ ప్రధాన కార్యదర్శులుగా వంగూరి రవి మాదిగ, చిన్నపెల్లి వెంకన్న మాదిగ, అధికార ప్రతినిధిగా కందికట్ల దయాకర్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కందికట్ల బాబు మాదిగ, నక్క రాజు మాదిగ ఎంపికయ్యారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చట్టబద్ధమైన దత్తతే శ్రేయస్కరం

- **కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనలు పాటించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

మాతృత్వం ఒక వరమని, పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు చట్టబద్ధమైన మార్గాన్ని అనుసరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. అక్రమంగా దత్తత తీసుకోవడం చట్టవిరుద్ధమని, ఎవరూ అలాంటి చర్యలకు పాల్పడవద్దని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (CARA) నిబంధనల ప్రకారం ఎంపికైన ఇద్దరు శిశువులను పూణే, పెద్దపల్లి జిల్లాలకు చెందిన దంపతులకు సీనియారిటీ ప్రకారం దత్తతకు అప్పగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శిశువులను దత్తత తీసుకునే వారు కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (CARA) నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.చట్టబద్ధమైన విధానంలో దత్తత తీసుకోవడం ద్వారా శిశువుల భద్రత, భవిష్యత్ ప్రయోజనాలకు రక్షణ ఉంటుందని తెలిపారు. అక్రమ దత్తతలకు దూరంగా ఉండి, అధికారిక విధానాల ద్వారానే పిల్లలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్. అవంతి, ఇన్‌చార్జి డీసీపీవో ఎస్. ప్రవీణ్‌కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# మూడు దశాబ్దాల తర్వాత... మళ్లీ ఒక్కచోట!

- **సీకేఎం స్నేహబంధానికి చిరునామాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం**
- **స్నేహం కోసం యూకే నుంచి వచ్చిన సాంబమూర్తి**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

మూడు దశాబ్దాల కాలం.. మారిన జీవితాలు.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు.. అయినా చెక్కుచెదరని స్నేహబంధం. వరంగల్‌లోని ప్రముఖ సీకేఎం డిగ్రీ కళాశాలలో 1996లో బీఎస్సీ మ్యాథ్స్ కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు హనుమకొండలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో సమ్మేళనం ఆద్యంతం సందడిగా, ఆప్యాయంగా సాగింది. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కళాశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో చేసిన చిలిపి పనులు, సరదా సంఘటనలు, తరగతి గదిలో జరిగిన ఆసక్తికర ఘటనలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకప్పుడు కలిసి తిరిగిన స్నేహితులు నేడు వివిధ ప్రాంతాల్లో స్థిరపడినా తమ మధ్య ఉన్న అనుబంధం మాత్రం మారలేదని ఈ సమ్మేళనం చాటిచెప్పింది.

**స్నేహం కోసం యూకే నుంచి..**

ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సాంబమూర్తి యూకే నుంచి ప్రత్యేకంగా రావడం ఆకర్షణగా నిలిచింది. కేవలం స్నేహితులను కలుసుకోవడంతో పాటు మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను మళ్లీ పంచుకునేందుకు ఆయన యూకే నుంచి హనుమకొండకు రావడంతో తోటి మిత్రుల్లో ఆనందం వెల్లివిరిసింది. సాంబమూర్తిని స్నేహితులు ఆప్యాయంగా పలకరించి ఆయన రాకపై సంతోషం వ్యక్తం చేశారు. 'కాలం మారినా.. దూరాలు పెరిగినా.. స్నేహం మాత్రం చెరిగిపోదు' అన్న మాటలకు ఈ సమ్మేళనం నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. విద్యార్థి దశ నుంచి నేటి వరకు సాగిన తమ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. పాత మిత్రులంతా కలిసి ఫొటోలు దిగుతూ, సరదాగా గడుపుతూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితుల ముఖాల్లో కనిపించిన ఆనందం, గతాన్ని గుర్తుచేసుకున్న కళ్లలో మెరిసిన జ్ఞాపకాలు, ఆత్మీయ పలకరింపులు ఈ సమ్మేళనాన్ని ఓ మధుర జ్ఞాపకంగా మార్చాయి .ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంజయ్, సమ్మయ్య, స్వామి, నారాయణరెడ్డి, సాంబమూర్తి, వెంకట్, శ్రీనివాస్, చంద్రయ్య, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

- **రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్**




బెస్ట్ వాయిస్,హైదరాబాద్:

స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ తొలితరం ఉద్యమనేత శ్రీమతి సంగం లక్ష్మీబాయి సేవలను గుర్తించి, సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఆమె పేరు పెట్టాలని పలువురు వక్తలు, సామాజిక సంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'మన ఆలోచన సాధన సమితి' వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు, 'తెలంగాణ స్వాభిమాన్ పరిషత్' వ్యవస్థాపకుడు వినయ్ కుమార్ యాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వాన్ని, బ్రిటిష్ పాలనను ఎదిరించి జైలు జీవితం గడిపిన ధీర వనిత సంగం లక్ష్మీబాయి అని కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, ఆచార్య వినోబా భావేతో కలిసి భూదాన్ ఉద్యమంలో నడిచిన ఆమె.. అణగారిన, వితంతు మహిళల అభ్యున్నతి కోసం 'ఇందిరా సేవా సదన్', విద్యార్థుల కోసం విద్యాపీఠాన్ని స్థాపించిన మహనీయురాలని గుర్తుచేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, ఉప విద్యాశాఖ మంత్రిగా, అనంతరం మూడు పర్యాయాలు లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించిన 'తెలంగాణ సావిత్రిబాయి పూలే' సంగం లక్ష్మీబాయి చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి లక్ష్మీబాయి పేరు పెట్టడంతో పాటు రాష్ట్ర సచివాలయం లేదా అసెంబ్లీ ప్రాంగణంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో బీసీ, బహుజన, సామాజిక సంఘాలను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, 'మాస్' అధికార ప్రతినిధి మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర, ఉపాధ్యక్షురాలు దుర్గారాణి రజక, బీసీ ఉద్యమకారుడు ఒట్టె జానయ్య యాదవ్, బొంగు ప్రసాద్ గౌడ్, చామకూర రాజు, పృధ్వీరాజ్ యాదవ్, నీరజా గౌడ్, శ్రీనివాస్ యాదవ్, గోపీ రజక, కైరంకొండ నర్సింగ్ రావు, తాడెం రమేష్ కుమార్, తొలి వెలుగు రఘు, కాలోజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డిఎస్. జగన్

బెస్ట్ వాయిస్,హైదరాబాద్:



సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా (Additional Director) పదోన్నతి పొందారు. ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన నూతన బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేలా పని చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుందరెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు.డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# రాహుల్ గాంధీపై కేసులు ఎత్తివేయాలి

- **కాంగ్రెస్ పార్టీ పోరాటం వ్యక్తుల కోసం కాదు.. ప్రజాస్వామ్యం కోసం: డీసీసీ అధ్యక్షుడు అయూబ్**



బెస్ట్ వాయిస్,వరంగల్:

ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలను సహించబోమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని, వెంటనే కేసులను ఉపసంహరించుకుని బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వెంకట్రామ జంక్షన్ వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేస్తూ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రజల తరపున ప్రశ్నిస్తున్నారని, ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. ప్రశ్నించే గొంతును కేసులతో అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా దేశ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో, ప్రజాక్షేత్రంలో బలంగా వినిపిస్తున్నారని తెలిపారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక కేసుల పేరుతో రాహుల్ గాంధీ గొంతును నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అయూబ్ అన్నారు. ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, అధికారంలో ఉన్నవారు విమర్శలను స్వీకరించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. రాహుల్ గాంధీపై ఎన్ని కేసులు పెట్టినా ఆయన ప్రజా పోరాటాన్ని ఆపలేరని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు అండగా నిలుస్తాయని అయూబ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం వ్యక్తుల కోసం కాదని.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసం అని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని, రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకటరాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజుకుమార్, మాజీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎద్దు సత్యం తదితరులతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల, యూత్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలపై నిలదీత.. క్షేత్రస్థాయిలో సమరానికి బీఆర్ఎస్

- ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలుపై ప్రశ్నలు
- వెయ్యి రోజుల పాలనపై వారం రోజుల నిరసనలకు శ్రీకారం
- ప్రజా సమస్యలపై వరుస కార్యక్రమాలు చేపడతాం: దాస్యం వినయ్‌భాస్కర్

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ మరోసారి క్షేత్రస్థాయిలో ఉద్యమానికి సిద్ధమైంది. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, వివిధ వర్గాల కోసం ప్రకటించిన డిక్లరేషన్లను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

**'బాకీ'లపై ప్రజల్లో చర్చ**

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన సంక్షేమ హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బీఆర్ఎస్ 'బాకీ'ల అంశాన్ని ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, వృద్ధులు, ఆటో కార్మికులు, ఉద్యోగులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితిపై ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించింది. రాష్ట్రస్థాయిలోనూ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు వివిధ వర్గాలను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది.



**హనుమకొండలో వారం రోజుల కార్యాచరణ**

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హనుమకొండలో వరుస నిరసన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజల ముందుంచాలని పార్టీ నిర్ణయించింది సెప్టెంబర్ 2న 420 హామీలను ప్రస్తావిస్తూ ఫ్లెక్సీలతో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు. సెప్టెంబర్ 3న రైతులకు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ కాజీపేట జంక్షన్‌లో రైతులతో కలిసి ధర్నా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 4న మహిళలు, వృద్ధులు, దివ్యాంగులతో కలిసి హనుమకొండ చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమం చేపట్టనున్నారు. సెప్టెంబర్ 5న యువత ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6న ఆటో కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. సెప్టెంబర్ 7న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేయనున్నారు. సెప్టెంబర్ 8న గత ప్రభుత్వ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిలిపివేత, హామీల అమలు తదితర అంశాలపై నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

**రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

రైతులకు ఇచ్చిన హామీల అమలు అంశాన్ని ఉద్యమంలో ప్రధానంగా ప్రస్తావించనున్నట్లు వినయ్‌భాస్కర్ తెలిపారు. రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం, పంటలకు మద్దతు, ఇతర రైతు సంక్షేమ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ ఇప్పటికే డిమాండ్ చేస్తోంది.

**యువత, మహిళల సమస్యలపైనా పోరాటం**

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు విద్యా సహాయం వంటి అంశాలను కూడా ఉద్యమంలో ప్రస్తావించనున్నట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. వివిధ వర్గాలకు సంబంధించిన సమస్యలను విడివిడిగా ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని పార్టీ కార్యాచరణ రూపొందించింది.

**ప్రశ్నిస్తే కేసులు పెడతారా?**

ప్రభుత్వ పనితీరును ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం ద్వారా ఉద్యమాన్ని అడ్డుకోలేరన్నారు. కేసులు, నోటీసులకు బీఆర్ఎస్ భయపడబోదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత బలంగా పోరాడుతామని స్పష్టం చేశారు.

**పశ్చిమ నియోజకవర్గంపై విమర్శలు**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధిపై అధికార పార్టీ చేస్తున్న ప్రచారంపైనా వినయ్‌భాస్కర్ విమర్శలు చేశారు. మూడేళ్లలో నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేశామని చెప్పుకోవడం వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రచారానికే పరిమితం కావడం సరికాదని విమర్శించారు. ఈ అంశాలపై కూడా ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**పోరాటం మరింత ఉధృతం చేస్తాం**

ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని వినయ్‌భాస్కర్ తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాలు, డివిజన్లు, నియోజకవర్గాల స్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడమే తమ ఉద్యమ లక్ష్యమని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

- సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వరంగల్ తూర్పులో వరుస కార్యక్రమాలు
- నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

బెస్ట్ వాయిస్,వరంగల్:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో రాజశ్రీ గార్డెన్స్‌లో నియోజకవర్గ ముఖ్య నాయకులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలపై నాయకులతో చర్చించి కార్యాచరణను ఖరారు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాలు, డివిజన్లలో ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ పాలనలో నెలకొన్న సమస్యలు, హామీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు.

**వారం రోజుల కార్యక్రమాలు ఇలా..**

సెప్టెంబర్ 2: ప్రజా సమస్యలు, బకాయిలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అండర్ బ్రిడ్జి నుంచి మడికొండ బజార్ వరకు సుమారు 200 మందితో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది. సెప్టెంబర్ 3: రైతులకు ఎరువుల కొరత, రైతు బీమా తదితర సమస్యలపై వరంగల్, కిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నారు. సుమారు 200 మంది పాల్గొనే ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు వరంగల్ ఎంఆర్ఓ కార్యాలయం వద్ద ప్రారంభమై, అనంతరం కిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగనుంది.

సెప్టెంబర్ 4: మహిళల సమస్యలు, సంక్షేమ పథకాల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నారు. సుమారు 300 మంది పాల్గొనే ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుంది.

సెప్టెంబర్ 5: విద్యార్థులు, యువత సమస్యలు, విద్యారంగంలో నెలకొన్న ఇబ్బందులు, యువతకు ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. సుమారు 300 మందితో వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు.

సెప్టెంబర్ 6: ఆటో కార్మికుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ నివాసం నుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయం వరకు ఆటోల ర్యాలీ నిర్వహించనున్నారు. సుమారు 200 మంది పాల్గొనే ఈ కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది.

సెప్టెంబర్ 7: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యలపై సుమారు 100 మందితో వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించనున్నారు.

సెప్టెంబర్ 8: కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై ప్రజా సమస్యలతో రూపొందించిన పత్రాన్ని కాశిబుగ్గ సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సమర్పించనున్నారు. సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నారు.

**ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం**

ఈ సందర్భంగా నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. 1000 రోజుల పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారి తరఫున బీఆర్ఎస్ బలమైన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ముఖ్య నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నన్నపనేని నరేందర్ పిలుపునిచ్చారు.

## ఏసీపీ జితేందర్‌రెడ్డి పదవీ విరమణ


# వేడుకలో నాయిని నీలిమారెడ్డి

- పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సతీమణి

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన ఏసీపీ జితేందర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా హనుమకొండలోని పిస్తా హౌస్ బాంక్వెట్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏసీపీ జితేందర్‌రెడ్డిని నీలిమారెడ్డి ప్రత్యేకంగా కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ, ప్రజలకు సేవలందించడంలో చూపిన అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏసీపీ జితేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.



# రేవంత్‌కు కేసీఆర్ భయం పట్టుకుంది

- ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది
- రైతు బీమా, కల్యాణలక్ష్మి పథకాలను నిర్వీర్యం చేసే కుట్ర: చల్లా ధర్మారెడ్డి



బెస్ట్ వాయిస్,హనుమకొండ:

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భయం పట్టుకుందని, అందుకే ప్రతి అంశంలో కేసీఆర్‌ను ప్రస్తావిస్తూ రాజకీయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని బాండ్ పేపర్లపై హామీ ఇచ్చిందని ధర్మారెడ్డి గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు దాటుతున్నా ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం అసహనంతో ఎదురుదాడికి దిగుతూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

**రైతు బీమా ఎందుకు నిలిపివేశారు?**

కేసీఆర్ ప్రభుత్వం రైతుల కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రైతు బీమా పథకాన్ని అమలు చేసిందని ధర్మారెడ్డి తెలిపారు. రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందేలా రూపొందించిన ఈ పథకం ప్రీమియం రెన్యువల్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఆగస్టు 13తో ప్రీమియం గడువు ముగిసినప్పటికీ పునరుద్ధరణపై స్పష్టత ఇవ్వకపోవడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని విమర్శించారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కారణంతోనే రైతు బీమాను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

**కల్యాణలక్ష్మిపై కుట్ర చేస్తున్నారు**

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీని అమలు చేయలేక పథకాన్నే తొలగించే కుట్ర జరుగుతోందని ధర్మారెడ్డి అన్నారు. ప్రభుత్వం తరఫున కొందరిని ప్రోత్సహించి కోర్టులను ఆశ్రయించే పరిస్థితి తీసుకొస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

**కాళేశ్వరం నీళ్లను ఎందుకు ఇవ్వడం లేదు?**

కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సకాలంలో సాగునీరు అందించి తెలంగాణను సస్యశ్యామలం చేశామని ధర్మారెడ్డి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అవసరమైన సమయంలో నీటిని అందించకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ సమయానికి మత్తళ్లు దూకాల్సిన చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయని, నీటితో నిండాల్సిన కాలువలు ఖాళీగా కనిపిస్తున్నాయని అన్నారు.

**యూరియా కోసం రైతులను తిప్పుతున్నారు**

రైతులకు సకాలంలో యూరియా అందించకుండా యాప్ విధానాన్ని తీసుకువచ్చి మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధర్మారెడ్డి మండిపడ్డారు. యూరియా కోసం ఒక మండలం నుంచి మరో మండలానికి రైతులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోందని విమర్శించారు.

**ఇందిరమ్మ ఇళ్లలో అక్రమ వసూళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ధర్మారెడ్డి ఆరోపించారు. ఇచ్చుకో.. పుచ్చుకో అనే పద్ధతిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను దగా చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు ఎలాంటి పొంతన లేదని విమర్శించారు.

**పరకాల అభివృద్ధి శూన్యం**

పరకాల నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులకు, అప్పట్లో శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తోందని ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరకాల నియోజకవర్గ అభివృద్ధికి కొత్తగా చేసిన కృషి ఏమీ లేదని, స్థానిక ఎమ్మెల్యే పనితీరు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం మేరకు ప్రజా సమస్యలపై పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగిస్తారని ధర్మారెడ్డి స్పష్టం చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌తో పాటు బీఆర్ఎస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మంచి మనసున్న మారాజు మా ఎమ్మెల్యే

- నీతి నిజాయితీకి మారుపేరు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- రేవూరి జన్మదినం సందర్భంగా మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మహా అన్నదానం
- పరకాల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్

బెస్ట్ వాయిస్,ఆత్మకూర్:

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పరకాల నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్న మంచి మనసున్న మహారాజు మా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ కొనియాడారు. మంగళవారం రోజున పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామానికి చెందిన పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హన్మకొండ లోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో పిల్లలతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణి చేసిన అనంతరం రకరకాల స్వీట్లు తో పాటు అన్నదానం నిర్వహించారు. అనంతరం మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయాయంలో పరకాల నియోజకవర్గాన్ని దోచుక తిన్నారు. దౌర్జన్యాలు దాడులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న సమయంలో నేను మీకు అండగా ఉంటానని వచ్చిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అంకితభావంతో నీతి నిజాయితీగా అభివృద్ధి చేస్తున్న మంచి మనసున్న ఎమ్మెల్యేను మరో పది సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా కొనసాగాలని మాదాసి శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే రేవూరి వెంట అనునిత్యం ఉంటూ రేవూరి నాయకత్వాన్ని బలపరుస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్,కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుండెబోయిన శ్యామ్, మండల కార్యదర్శి మార్త కేదారి,గ్రామ అధ్యక్షులు కాసిం, యూత్ కాంగ్రెస్ నాయకులు కడబోయిన రాజ్ కుమార్, మహమ్మద్ కరీం, షరీఫ్, మాదాసి రాజు, మడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా రేవూరి జన్మదిన వేడుకలు!

- ఆలయాల్లో పూజలు
- ఘనంగామహాఅన్నాదాన కార్యక్రమం!

బెస్ట్ వాయిస్,ఆత్మకూరు:

మండల కేంద్రంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలకు నియోజకవర్గ,మండల యువజన కాంగ్రెస్ నేతలు సేవాదళ్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు నాయకులు కార్యకర్తలు భారీగా వచ్చారు. ఆత్మకూర్ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక పైన కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ముందుగా మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, జిల్లా నాయకులు కమలాపురం రమేష్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రేవూరి రణధీర్ రెడ్డి, పరకాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ మండల అధ్యక్షులు తనుగుల సందీప్ లు ఆత్మకూరు శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి దంపతుల పేరు పైన ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. ప్రజా నాయకుడైన రేవూరి ప్రకాష్ రెడ్డికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోమంత్రి పదవి లభించి నియోజకవర్గ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. పరకాల నియోజకవర్గం ఆదర్శంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న రేవూరి ప్రకాష్ రెడ్డికి దేవుడి ఆశీర్వాదం ఎల్లవేళలా ప్రసాదించాలని కోరుకున్నారు అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముద్దం సాంబయ్య బోరిగం స్వామి మాజీ సర్పంచ్ కంచ రవి కుమార్ మాజీ పిఎస్ సిహెచ్ చైర్మన్ ఎరుకొండ రవీందర్ గౌడ్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరీటి బిసి సెల్ నియోజకవర్గ నాయకులు చిమ్మని దేవరాజ్, రేవురి జయపాల్ రెడ్డి తాళ్ల కిరణ్ కంది కమలాకర్ రెడ్డి సంగే మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో 37 ఏళ్ల పోలీస్ సేవ.. ఎస్సై ఈశ్వరయ్యకు ఘన వీడ్కోలు

బెస్ట్ వాయిస్,చిట్యాల:



పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన చిట్యాల పోలీస్ స్టేషన్ ఎస్సై3 ఈశ్వరయ్యకు పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చిట్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా వీడ్కోలు సభ నిర్వహించారు.కార్యక్రమంలో చిట్యాల సీఐ వై. సతీష్, ఎస్సై పోచంపల్లి సతీష్ కలిసి పదవీ విరమణ పొందిన ఎస్సై ఈశ్వరయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ వై. సతీష్ మాట్లాడుతూ, పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి సేవా జీవితంలో ఒక సహజమైన ఘట్టమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో సుమారు 37 సంవత్సరాల పాటు ఎంతో నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు, పోలీస్ శాఖకు విశిష్ట సేవలు అందించిన ఈశ్వరయ్య సేవలు అభినందనీయమని కొనియాడారు. సుదీర్ఘకాలం పాటు తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చిన ఈశ్వరయ్యను ఈ సందర్భంగా ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం ఆయన భావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, సహచర ఉద్యోగులు పాల్గొని ఎస్సై ఈశ్వరయ్యకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

బెస్ట్ వాయిస్,ఆత్మకూర్:



ఆత్మకూరు మండల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమంలో భాగంగా 30 లక్షల మంది విద్యార్థుల యొక్క 14 వేల కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డీటీ మమతకి విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మైదం రవి మాట్లాడుతూ,ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేయాలని,ప్రభుత్వం వెంటనే ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల సర్టిఫికేట్ లు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ఇవ్వాలని, అదేవిధంగా ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయి. కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ,ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.కె సలీం పాషా, మండలాధ్యక్షులు, బాగజీ రజినీకాంత్ , మండల నాయకులు రాదరపు రాజు , మదసి జశ్వంత్,ఎస్.కె కమల్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సినిమాకు రూ.4 కోట్లు డిమాండ్



మలయాళి ముద్దుగుమ్మ మమితా బైజు ఒక్కసారిగా టాప్ ఆఫ్ ది సౌత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ అయింది. ఈమె నటిగా ఇండస్ట్రీలో అkడుగు పెట్టి దాదాపుగా పదేళ్లు అవుతుంది. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు వరుస సక్సెస్‌లను సొంతం చేసుకుంది. 2024లో వచ్చిన ప్రేమలు సినిమాతో తమిళ్, తెలుగు భాషల్లోనూ పాపులారిటీ సొంతం చేసుకున్న మమితా బైజు తాజాగా విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాతో స్టార్ హీరోయిన్స్ జాబితాలో చేరి పోయింది. అందంతో పాటు అభినయం కావాలంటే మమిత బైజును తమ సినిమాల్లో ఎంపిక చేసుకోవాలి అనుకునే స్థాయికి ఆమె చేరింది అంటే ఆమె నటన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలో కొన్ని సీన్స్ లో ఏకంగా స్టార్ హీరో సూర్యను డామినేట్ చేసే విధంగా నటించింది అంటూ కొందరు రివ్యూల్లో రాసిన విషయం తెల్సిందే. అందుకే మమిత క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది.ఇన్నాళ్లు మలయాళ సినిమాలు మాత్రమే చేసిన మమిత బైజు గత ఏడాది కాలంగా పూర్తిగా తమిళ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఆమె ఒక మలయాళ సినిమాతోనూ వచ్చింది. 2026లో ఈమె నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అన్ని సినిమాల్లోనూ ఈమె పోషించిన పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. సూపర్ స్టార్ విజయ్‌తో కలిసి నటించిన జన నాయగన్ ఫలితం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒరిజినల్ వర్షన్ లో శ్రీలీల పోషించిన పాత్రలో మమిత బైజు నటించిన విషయం తెల్సిందే. శ్రీలీల కంటే చాలా బెటర్‌గా మమిత బైజు నటించిందని, యాక్షన్ సీన్స్‌లోనూ వావ్ అనిపించింది అంటూ ప్రశంసలు కురిపించారు. ఇక విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలోని మమిత బైజు నటన, చిలిపితనం, అందం ఇలా అన్ని విషయాలు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకున్నాయి. మలయాళ సినిమాలు ఈమె తక్కువ కమిట్ కావడానికి కారణం పారితోషికం అనే వార్తలు వస్తున్నాయి. తమిళ్, తెలుగు సినిమాల పారితోషికాలతో పోల్చితే మలయాళ సినిమాల పారితోషికాలు దాదాపు సగం, అంతకంటే తక్కువగా ఉంటాయి. అందుకే మలయాళ సినిమాలు వస్తున్నప్పటికీ పారితోషికం ఇష్యూ కారణంగా నో చెబుతుంది అంటూ అక్కడి స్థానిక మీడియా మమితపై విమర్శలు చేస్తూ రాస్తున్నారు. తమిళంలో ఈమె ఒక్క సినిమాకు మొన్నటి వరకు రెండు కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా విజయంతో ఆ పారితోషికం ఏకంగా రూ.3 కోట్లకు పెరిగిందని తెలుస్తోంది. తమిళ్‌లో ఈమె ఇటీవల ఒక సినిమాకు సైన్ చేసిందని, అందుకు గాను రూ.3 కోట్ల పారితోషికం ఒప్పందం జరిగిందని తమిళ మీడియా కథనాలు వచ్చాయి. మమిత ఇప్పటి వరకు తెలుగు సినిమా సైన్ చేయలేదు.

Printed, Published & Owned by Kowdagani Jyothi Printed at VM Printers H.No. 8-10-37, Radhika Theatre, Warangal.Telangana- 506002. Published at # 16-1-558/2 SRR Thota,Kareemabad, Warangal. Telangana -506002. Editor: Kowdagani Mohan Rao, RNI No.TELTEL/2016/68994. Cell:9963334550, email: bestvoicenews@gmail.com